సాక్షి నిజామాబాద్

గురువారం : 10 : ఆగస్టు : 2023



ఉద్యోగులకు బయోమెట్రిక్

ఆలయాల్లో ఉద్యోగులకు త్వరలో బయోమెట్రిక్ హాజరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ తెలిపారు.

- 8లో ▸



గృహ నిర్బంధాలు..

నగరంలో బుధవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పలు పార్టీల నాయకులను గృహ నిర్బంధం చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /24.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం పాక్షికంగా మేఘావృతం కావచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బందోబస్తును పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ



ఖలీల్‌వాడి : మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటనకు సంబంధించిన బందోబస్తును ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మున్సిపల్ కార్పొరేషన్ ప్రారంభోత్సవం చేసేందుకు వచ్చిన మంత్రిని బీఆర్ఎస్ నేతలు కలిసేందుకు రావడంతో పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా ఎవరికీ అనుమతి ఇవ్వమని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు మంత్రి ప్రయాణిస్తున్న రోడ్లను పోలీసులు క్లియర్ చేశారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్‌తో పాటు అదనపు డీసీపీ జయరామ్, 8 మంది ఏసీపీలు, 30మంది సీఐలు, 80 మంది ఎస్సైలు, 650 ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

102 మద్యం షాపులకు 29 దరఖాస్తులు

ఖలీల్‌వాడి : జిల్లాలో 102 మద్యంషాపులకు 29 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. బుధవారం 14 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. 2023–25 మద్యం దుకాణాల పాలసీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని, నిజామాబాద్ ఎక్సైజ్ జిల్లా పరిధిలో 102 మద్యం దుకాణాలకు ఆసక్తి కల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అర్హులని, దీనికి రూ. 2 లక్షల డీడీ లేదా చలనా తీసి జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 18న దరఖాస్తులకు గడువు ముగుస్తుందన్నారు.

పసుపు ధర @ రూ.14,375

సుభాష్‌నగర్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో బుధవారం పసుపునకు రికార్డు స్థాయిలో ధర పలికింది. క్వింటాలుకు రూ.14,375 ధర వచ్చింది. పసుపు ధర సగటున రూ. 11వేలకు పైచిలుకు పలకడం గమనార్హం. మండ సైతం ఎన్నడూ లేని విధంగా రూ. 10 వేల వరకు పలుకుతుంది. మార్కెట్‌యార్డుకు 895 క్వింటాళ్ల పసుపు కొమ్ము, 1,098 క్వింటాళ్లు మండ, 85 క్వింటాళ్ల చూర పసుపు వచ్చింది. పచ్చ బంగారం ధర పైపైకి పెరగడంతో పసుపు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. చాలామంది రైతులు పసుపు పంటను ఆలస్యంగా వి త్తుకుంటున్నారు. రానున్న రోజుల్లో పసుపు ధర క్వింటాలుకు రూ.20వేలు పలికే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నాయి.

13న చెస్ క్రీడలో ఎంపికలు

నిజామాబాద్ నాగారం : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న అండర్–7, అండర్–11 బాలబాలికల విభాగంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు నగరంలోని వినాయక్‌నగర్ అభ్యాస స్కూల్‌లో ఉదయం 9 గంటలకు ఉంటాయన్నారు. అండర్–7 విభాగంలో 01-01-2016 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. అండర్–11 విభాగంలో 01-01-2012 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. క్రీడాకారులంతా పుట్టిన రోజు సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. 94400 07004లో సంప్రదించాలన్నారు.

11న సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికలు

నిజామాబాద్‌నాగారం : ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు సంబంధించి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాస్థాయిలో ఈనెల 11న ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో 17 రకాల క్రీడా పోటీలకు సంబంధించి సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ ఉదయం 10.30 గంటలకు పాత కలెక్టరేట్ మైదానంలో పేర్లు నమోదు చేసుకుంటున్నామన్నారు. ఈనెల 18 నుంచి 21వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు.

మున్సిపాలిటీలకు నిధులు మంజూరు

నిజామాబాద్ నాగారం : ఉమ్మడి జిల్లాలో ఉన్న మున్సిపాలిటీలకు రూ. 629.70 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో బాన్సువాడకు రూ.50 కోట్లు, కామారెడ్డికి రూ. 60 కోట్లు, ఎల్లారెడ్డికి రూ. 25 కోట్లు, భీంగల్‌కు రూ. 35 కోట్లు, ఆర్మూర్‌కు రూ. 100 కోట్లు, బోధన్‌కు రూ. 50 కోట్లు, నిజామాబాద్ మున్సిపాలిటీలకు 149.65 కోట్లు, నిజామాబాద్ సేవరేజ్ ప్యాకేజ్ కింద రూ. 160.05 కోట్లు మంజూరు చేశారు. అలాగే ఆయా బల్దియాల్లో పట్టణప్రగతి కింద మరో రూ. 1751.87 కోట్ల నిధులు మంజూరు చేశారు.



పాలిటెక్నిక్ మైదానంలో బహిరంగ సభలో ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాను అభినందిస్తున్న మంత్రి కేటీఆర్



బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు, ప్రజలు

నగరం మారుపేరు అభివృద్ధి!

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నగర పాలక సంస్థ భవన నిర్మాణం
- హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌ను మించి రఘునాథ చెరువు సుందరీకరణ
- మహాప్రస్థానం కంటే మెరుగైన విధంగా వైకుంఠధామాలు
- కితాబు నిచ్చిన పురపాలక శాఖ, ఐటీ మంత్రి కె తారక రామారావు
- కార్పొరేషన్‌లోని డివిజన్‌లకు నిధులు మంజూరు చేస్తూ ప్రకటన
- ఎమ్మెల్యే బిగాలను 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి



నూతన మున్సిపల్ భవనంలో మంత్రులు కేటీఆర్, వేముల, ఎమ్మెల్యే బిగాల, మేయర్ నీతూకిరణ్, కార్పొరేటర్లు

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ నగరంలో ఎంతో అభివృద్ధి జరిగిందని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కితాబు నిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఇలా మాట్లాడారు.

■ నగర పాలక సంస్థ కార్యాలయంలో కొత్త భవనాన్ని రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా నిర్మించారు.

■ వైకుంఠ ధామాలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానం కంటే మెరుగ్గా నిర్మించారు. ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సొంత ఇంటిపనిలాగా ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ఏ ప్రజాప్రతినిధులు చేయని అభివృద్ధి ప్రస్తుతం జరిగింది.

■ హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ కంటే నిజామాబాద్‌లోని రఘునాథ చెరువును ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దడం హర్షణీయం. నగరంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, సమీకృత మార్కెట్ సముదాయాలు, కళాభారతి కేంద్రం వంటివి అభివృద్ధికి నిదర్శనాలు.

■ ఎమ్మెల్యే బిగాల అర్బన్ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో ఉచిత అన్నదానం చేపట్టి అనేక మందికి సహాయం చేశారు. కార్మిక, మహిళా దినోత్సవం వివిధ సందర్భాల్లో ఉచిత భోజనం, చీరల పంపిణీ చేపట్టడం అభినందనీయం.

ఎమ్మెల్సీ కవిత గైర్హాజరు..

బహిరంగ సభకు ఎమ్మెల్సీ కవిత గైర్హాజరుపై మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ నిజామాబాద్ అభివృద్ధి కోసం నిధులు తెప్పించేందుకు సీఎంను కలుస్తానని కవిత తనకు చెప్పారన్నారు. అందుకే సభకు రాలేకపోయారన్నారు.

కార్మికులు మెచ్చుకున్నారు..

■ కార్మికులతో సహపంక్తి భోజనం చేసేటప్పుడు లావణ్య, యాదమ్మలతో మీ ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నాను. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చాలా అద్భుతంగా పనిచేస్తున్నాడని అందరినీ ఆదుకుంటున్నాడని చెప్పడం సంతోషంగా ఉంది.

■ గతంలో ఉన్న పాలకులు ఈ నియోజక వర్గాన్ని పట్టించుకోలేదు. నిధులు కూడా తీసుకురాలేదు. ప్రస్తుతం రూ. కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉంది. నైపుణ్యాభివృద్ధి కలిగి ఉన్న వారికి ఆయా రంగాల్లో విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఈ దిశగా యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తోంది. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

డివిజన్‌కు రూ. కోటి : కేటీఆర్ ప్రకటన

అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా తన నియోజక వర్గ అభివృద్ధికి ఏదైన సహాయం చేయాలని అడుగగా స్పందించిన కేటీఆర్ 60 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌కు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్బన్ మరింత అభివృద్ధి చెందాలని, వచ్చే ఎన్నికల్లో బిగాలను 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బహిరంగసభలో రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రావు, గంగాధర్ గౌడ్, రాష్ట్ర మహిళా సహకార సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలిత, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, టీఎన్ జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ట్రెసా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్, ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలను దృష్టిలో ఉంచుకొని : ఎమ్మెల్యే బిగాల

నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గాన్ని వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాకుండా భవిష్యత్తు తరాలకు అభివృద్ధి అందాలని పనిచేస్తున్నాను. నిజామాబాద్ అర్బన్ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్ ఎంతో సహాయం చేశారు. ఐటీ రంగం హైదరాబాద్‌కే కాకుండా మీ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి చెందాలని ఆ బాధ్యత మీపై ఉండాలన్నారు. అందులో భాగంగానే జిల్లాకు ఐటీ హబ్‌ను మంజూరు చేశారు. నగరంలో అన్ని రకాల అభివృద్ధి జరిగింది. మంచి రోడ్లు, నీటి వసతి, యూజీడీ పనులు కూడా పూర్తి చేసుకున్నాము. ఇవి భావితరాలకు ఎంతగానో ఉపయోగపడుతాయి.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై ఎన్ని విమర్శలు వచ్చినా విజయవంతంగా పూర్తిచేశాము. జిల్లా కేంద్రంలో ఐటీ హబ్‌తో పాటు న్యాక్ శిక్షణ కేంద్రం, నూతన మున్సిపల్ కార్యాలయం, వైకుంఠధామాల అభివృద్ధికి నిధులు కేటాయించిన కేటీఆర్‌కు ధన్యవాదాలు. గత 50 ఏళ్ల నుంచి జరగని అభివృద్ధి నా హయాంలో జరిగింది.



ట్యాంక్‌బండ్‌పై బిగాల సెల్ఫీ విత్ కేటీఆర్

జెడ్పీ చైర్మన్ బొకే నిరాకరణ

నిజామాబాద్‌అర్బన్ : పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో సభావేదికపై మంత్రి కేటీఆర్‌కు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు వినతిపత్రం, పూలబొకెను ఇవ్వాలని ప్రయత్నించగా కేటీఆర్ నిరాకరించారు. దీంతో జెడ్పీ చైర్మన్ వెనుతిరిగి వెళ్లిపోయారు. జెడ్పీ భవనం శిథిలావస్థలో ఉందని, నూతన భవనం మంజూరు కోసం ఆయన విజ్ఞప్తి చేయాలనుకున్నారు. చైర్మన్‌పై జెడ్పీటీసీ సభ్యుల అసంతృప్తి, కోరం లేక మంగళవారం జెడ్పీ సమావేశం వాయిదా పడడం తదితర కారణాలుగా తెలుస్తోంది. ఇది పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

మంత్రి కేటీఆర్ పర్యటన సైడ్‌లైట్స్

సుభాష్‌నగర్/నిజామాబాద్ నాగారం :

- ఉ.11.48 గంటలకు హెలిక్యాప్టర్‌లో కలెక్టరేట్ ప్రాంగణానికి మంత్రి కేటీఆర్ చేరుకున్నారు.
- హెలిక్యాప్టర్‌లో కేటీఆర్‌తో మంత్రి ప్రశాంత్ రెడ్డి, రాజ్యసభ్య సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఇతర అధికారులు వచ్చారు.
- కేటీఆర్‌కు ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మేయర్ నీతూకిరణ్, మున్సిపల్ కమిషనర్ మకరందు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, తదితరులు ఘన స్వాగతం పలికారు.
- ఉదయం 11.58 గంటలకు కేటీఆర్ ఐటీ హబ్ ప్రారంభించారు. గంటపాటు ఉద్యోగులు, కంపెనీ సీఈవోలతో సమావేశమయ్యారు.
- మధ్యాహ్నం 1.10 గంటలకు న్యాక్ భవనం ప్రారంభించారు. ట్రెనింగ్ తీసుకుంటున్న అభ్యర్థులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- న్యాక్ బిల్డింగ్ బయట జై బీజేపీ అని నినదించిన బీజేపీ కార్మిక సంఘం నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
- మధ్యాహ్నం 1.20 గంటలకు దుబ్బ వైకుంఠ ధామాన్ని ప్రారంభించారు.
- మధ్యాహ్నం 1.42 గంటలకు మున్సిపల్ భవనం, మధ్యాహ్నం 2.08 గంటలకు వర్ని రోడ్‌లోని వైకుంఠధామాన్ని, మధ్యాహ్నం 2.18కు ఖిల్లా వద్ద మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రారంభించారు.
- మధ్యాహ్నం 2.42 గంటలకు అర్సపల్లిలోని వైకుంఠ ధామం ప్రారంభం.
- 2.58 గంటలకు శ్రీరామగార్డెన్‌లో మున్సిపల్ కార్మికులతో సహపంక్తి భోజనం చేశారు.
- 3.26 గంటలకు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బహిరంగ సభ వేదికపైకి చేరుకున్నారు.
- 3.45 గంటలకు కేటీఆర్ ప్రసంగం ప్రారంభించి 38 నిమిషాలపాటు మాట్లాడారు.
- 4.48 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలీప్యాడ్ నుంచి కేటీఆర్ బయల్దేరి హైదరాబాద్‌కు వెళ్లారు.

రూ.100 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ అర్బన్‌లో పు రపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. బుధవారం ఉదయం 11.58 గంటలకు రూ.50 కోట్ల తో నిర్మించిన ఐటీ హబ్‌ను ప్రారంభించారు. అనంతరం వరుసగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.6 కోట్ల 15 లక్షలతో నిర్మించిన న్యాక్ శిక్షణ కేంద్రం, రూ.7 కోట్లతో నిర్మించిన మున్సిపల్ నూతన భవనం, దుబ్బ, వర్నిరోడ్డు, అర్సపల్లిలో రూ.15 కోట్ల 50 లక్షలతో నిర్మించిన మూడు వైకుంఠధామాలు, రూ.22 కోట్లతో నిర్మించిన రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను ప్రారంభించారు. శ్రీరామగార్డెన్ లో మున్సిపల్ కార్మికులతో మంత్రి కేటీఆర్ సహపంక్తి భోజనాలు చేశారు.

తెలంగాణ అభివృద్ధిలో కేటీఆర్ కృషి ఉంది : ప్రశాంత్‌రెడ్డి



తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఈ అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కీలకమైతే అందులో కేటీఆర్ ఒక భాగం. దేశ విదేశాల్లో పారిశ్రామిక వేత్తలను కలిసి హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారు. మూడు లక్షల కోట్ల పరిశ్రమలు, 16 లక్షల ఉద్యోగాలు ఇప్పించిన ఘనత కేటీఆర్‌దే. నూతనంగా తొమ్మిది లక్షల ఐటీ ఉద్యోగాలను పెంపొందించారు. గతంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.లక్ష 12వేలు ఉండగా, ప్రస్తుతం రూ.3 లక్షలకు పెరిగింది.



మున్సిపల్ కార్మికులతో సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి కేటీఆర్



ఐటీ హబ్‌లో ఉద్యోగులతో మాట్లాడుతూ..



మినీ ట్యాంక్‌బండ్ ప్రారంభిస్తున్న మేయర్ నీతూకిరణ్, కేటీఆర్

‘గృహలక్ష్మి’ పథకం నిరంతర ప్రక్రియ

- లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు
- తెల్లరేషన్‌కార్డు, ఖాళీ స్థలం ఉంటే ఈ పథకానికి అర్హులు
- మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం : సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకానికి రూ. 3 లక్షలు మంజూరు చేస్తున్నారని ఈ విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారం ప్రజలు నమ్మొద్దని మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి చివరి తేదీ అంటూ ఏమీ లేదని, తెల్లరేషన్ కార్డు, ఖాళీ స్థలంతో పాటు కులధృవీకరణ పత్రాలు ఉంటే చాలన్నారు. కొన్ని పాతస్థలాలకు దస్తావేజు పేపర్లు ఉండవని, ఇంటినంబర్లు ఉంటే చాలని, ఖాళీ స్థలం ఉన్నా సరే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం నిరంతర ప్రక్రియని, మొదటి దశలో నియోజకవర్గానికి రూ. 3 వేలు మంజూరు చేస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్లాబ్ ఇల్లు ఉండకూడదన్నారు. ఖాళీ స్థలం ఉండి, కులధృవీకరణ సర్టిఫికెట్ ఉంటే ఇవే గృహలక్ష్మికి అర్హతలన్నారు. కేవలం మహిళల పేరు పైనే నగదు ఇస్తామన్నారు. దళారులను నమ్మవద్దని, తొందర్లోనే మొదటి దశ ప్రారంభమవుతుందన్నారు. ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు చేసే అసత్య ప్రచారాలు నమ్మవద్దన్నారు.

సమైక్యదేశాన్ని బీజేపీ విచ్ఛిన్నం చేస్తోంది



ఖలీల్‌వాడి : సమఖ్య దేశాన్ని బీజేపీ విచ్ఛినం చేస్తుందని డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ భవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించా రు. డీసీసీ అధ్యక్షుడు జాతీయ జెండాను, నగర అధ్యక్షుడు కేశవేణు యూత్ కాంగ్రెస్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్‌నాయకుల అరెస్టులు, నిర్బంధాలు సరికావని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు అన్నారు. పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బీన్‌హందాన్ వేణురాజ్, రత్నాకర్, కేశ మహేష్, సంతోష్, గంగారెడ్డి, మల్లైకా, నరేందర్ రేవతి తదితరులున్నారు.

మోదం.. ఖేదం

- 201మందికిపైగా వీఆర్ఏలు ఇతర జిల్లాలకు..
- మొత్తం 1,223 మందిని వివిధ శాఖలకు కేటాయింపు
- మరో 420 మంది వారసత్వ ఉద్యోగాలకు బ్రేక్
- వేరే జిల్లాల్లో కేటాయింపులపై ఉద్యోగుల అసంతృప్తి

సుభాష్‌నగర్ : గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)ను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తూ తీసుకున్న నిర్ణయం కొందరికి మోదం.. మరికొందరికి ఖేదాన్ని మిగిల్చింది. జిల్లా నుంచి సుమారు 201 మందిని ఇతర జిల్లాలకు కేటాయిస్తూ సీసీఎల్ ఏ నుంచి ఆదేశాలొచ్చాయి. మొత్తం 1,223 మందిని జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లో వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. మిగితా 420 మంది వరకు వారసత్వ ఉద్యోగాలపై ప్రభుత్వ నిర్ణయం తీసుకోకపోవడంతో బ్రేక్ పడింది. కాగా ఇతర జిల్లాలకు కేటాయించగా వారు అసంతృప్తితో ఉన్నారు.

జిల్లాలో 452 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో 1,643మంది వీఆర్ఏలు పనిచేస్తున్నారు. వీరిలో ఏపీపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ ద్వారా 125 మంది వరకు నియమితులయ్యారు. పీజీ చదివిన వారు 69 మంది, డిగ్రీ పూర్తి చేసిన వారు 158, ఇంటర్ చదివిన వారు 220, ఎస్సెస్సీ 269, నిరక్షరాస్యుల నుంచి ఏడోతరగతి వరకు చదివిన వారు 802 మంది ఉన్నారు. 61 ఏళ్లలోపు వారందరికీ పే స్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన విషయం తెలిసిందే. అలాగే 61 ఏళ్లపైబడిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరిని రెవెన్యూ, ఇంటర్ ఎడ్యుకేషన్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా గ్రంథాలయ సంస్థ, జలవనరులు, మిషన్ భగీరథ, ఐసీడీఎస్, పశుసంవర్ధకశాఖ, బీసీ వెల్ఫేర్, పంచాయతీరాజ్, మెడికల్ ఎడ్యుకేషన్, స్కూల్ ఎడ్యుకేషన్, తదితరశాఖల్లో సర్దుబాటు చేశారు.

ఇతర జిల్లాలకు బదిలీపై ఆందోళన..

వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ప్రభుత్వం.. ఇతర జిల్లాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వీఆర్ఏలతో భర్తీ చేస్తోంది. జిల్లాలో ఉద్యోగాల కంటే ఉద్యోగులు ఎక్కువగా ఉండటంతో 201 మందిని వివిధ శాఖల్లో ఇతర జిల్లాల్లో సర్దుబాటు చేసింది. 61 మంది జూనియర్ అసిస్టెంట్లు కాగా, 140 మంది రికార్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. రెవెన్యూ, ఇంటర్ ఎడ్యుకేషన్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా గ్రంథాలయ సంస్థ, తదితర శాఖలకు కేటాయించారు. ఇంత కాలం సొంత గ్రామాల్లో పనిచేసిన వీఆర్ఏలు సుదూర జిల్లాలకు బదిలీ చేయడంపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

వారసత్వ ఉద్యోగాలపై రాని స్పష్టత..

61 ఏళ్లు నిండిన వీఆర్ఏల స్థానంలో వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ 50 నుంచి 61 ఏళ్ల మధ్య ఉన్న వీఆర్ఏలు కొందరు అనారోగ్యాలకు గురి కావడం, మరికొందరి ఆధార్‌కార్డుల్లో వయస్సు తప్పుగా ఉండటం, ఇతరత్రా కారణాలతో వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఫిర్యాదు వచ్చాయి. ఈ అంశాలను ట్రెసా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో నిర్ణయం వెలువడొచ్చంటున్నారు.

క్లుప్తంగా

ముస్తఫా అర్ఫత్‌కు పీహెచ్‌డీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం పరిశోధక విద్యార్థి మహమ్మద్‌ ముస్తఫా అర్ఫత్‌ పీహెచ్‌డీ సాధించారు. తెయూ ఉర్దూ ప్రొఫెసర్‌ అత్తర్‌ సుల్తానా పర్యవేక్షణలో 'ప్రొఫెసర్‌ మహమ్మద్‌ అలీ బహీసియాథ – ఈ – ముహకిక్‌' అనే అంశంపై ముస్తఫా అర్ఫత్‌ పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. బుధవారం తెయూ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ మినీ సెమినార్‌ హాల్‌లో నిర్వహించిన వైవావోస్‌కు శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి) ప్రొఫెసర్‌ నిస్సార్‌ హైమద్‌ ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ పి కనకయ్య, బీవోస్‌ చైర్మన్‌ మహమ్మద్‌ అబ్దుల్‌ ఖవి, అధ్యాపకులు మూసాఖురేషీ, గుల్‌–ఏ–రాణా తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఖలీల్‌వాడి: కాంగ్రెస్‌ బలోపేతం కోసం కిసాన్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జీలను నియమించినట్లు కిసాన్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు ముప్పు గంగారెడ్డి బుధవారం తెలిపారు. పడిగెల ప్రవీణ్‌(నిజామాబాద్‌ రూరల్‌), సురేష్‌(బాల్కొండ), కిషన్‌(బోధన్‌), టక్కరి గంగాధర్‌(ఆర్మూర్‌), మందర్న రవి (బాన్సువాడ), సంతోష్‌(నిజామాబాద్‌ అర్బన్‌)ను నియమించినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ మూల్యాంకన డైరీల పంపిణీ



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): వ్యవసాయ మూల్యాంకన డైరీలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌ హుస్సేన్‌ పంపిణీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ప్రస్తుత వానకాల పంటలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు పంటల్లో చీడ పీడలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కేవీకే ద్వారా అందిస్తున్న వ్యవసాయ సేవలను వినియోగించుకోవాలని, వ్యవసాయ మూల్యాంకనంలో ఉన్న సమాచారాన్ని ఏఈవోలు రైతులకు అందించాలని డీఏవో సూచించారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌ నవీన్‌ కుమార్‌, శాస్త్రవేత్తలు వెంకట రాజ్‌కుమార్‌, శ్వేత, సీపీవో బాబురావు, ఆర్థిక గణాంక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ శ్రీవల్లి పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్‌, చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, గోవర్ధన్‌, షకీల్‌, జెడ్పీ చైర్మన్లు విఠల్‌రావు, శోభ, డీసీసీబీ చైర్మన్‌ భాస్కర్‌రెడ్డి

మంత్రి కేటీఆర్‌ సుడిగాలి పర్యటన

- రూ.వంద కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- మున్సిపల్‌ కార్మికులతో సహపంక్తి భోజనం

నిజామాబాద్‌నాగారం: నగరానికి వచ్చిన ఐటీ, మున్సిపల్‌ శాఖ మంత్రి కేటీఆర్‌ సుడిగాలి పర్యటన చేశారు. రూ.వంద కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఐటీ హబ్‌లోని 12 కంపెనీలకు సంబంధించిన కార్యాలయాలను ప్రారంభించి, అన్ని విభాగాలను సందర్శిస్తూ వసతి, సదుపాయాలను పరిశీలించారు. కొత్తగా ఐటీ కొలువుల్లో చేరిన ఉద్యోగులు, బాసర ట్రిపుల్‌ ఐటీ విద్యార్థులతో మంత్రి కేటీఆర్‌ భేటీ అయ్యారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారిని అభినందించారు. మీ జిల్లాలోనే ఐటీ హబ్‌ నెలకొల్పామని, సాఫ్ట్‌వేర్‌ రంగానికి భవిష్యత్‌ ఉందన్నారు. అనంతరం న్యాక్‌భవనంలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో మంత్రి ముచ్చటించారు. అనంతరం న్యాక్‌భవనాన్ని ప్రారంభించారు. మంచి శిక్షణ తీసుకోని ఉపాధి పొందాలన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన వైకుంఠధామాలు ప్రశాంతమైన వాతావరణంలో ఉన్నాయని చెప్పారు. నగరంలోని దుబ్బ, అర్సపల్లి, వర్నిరోడ్డులోని వైకుంఠధామాలను ఆయన ప్రారంభించారు. మున్సిపల్‌ భవనాన్ని ప్రారంభించిన అనంతరం మేయర్‌ దండు నీతూకిరణ్‌ను సీట్‌లో కూర్చొబెట్టి మాట్లాడారు. అనంతరం మీటింగ్‌ హాల్‌లో ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, మైనారిటీ నాయకులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి, సమస్యలపై చర్చించారు.

మరో మూడు బస్తీ దవాఖానాలు

నిజామాబాద్‌ నగరంలో మరో మూడు బస్తీ దవాఖానాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మున్సిపల్‌ కమిషనర్‌ మకరందుకు మంత్రి కేటీఆర్‌ ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందిని సైతం నియమించలన్నారు. అలాగే పలు సమస్యలపై మైనారిటీ నాయకులు మంత్రి కేటీఆర్‌కు విన్నవించారు.

మినీ ట్యాంక్‌బండ్‌ పరిశీలన

నూతనంగా నిర్మించిన మినీట్యాంక్‌ బండ్‌ రఘునాథ్‌ చెరువును మంత్రి కేటీఆర్‌ పరిశీలించారు. ఎమ్మెల్యే బిగాల, రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌, బోధన్‌ ఎమ్మెల్యే షకీల్‌ ఆమేర్‌, నగర మేయర్‌ నీతూకిరణ్‌లతో కలిసి ఎలక్ట్రికల్‌ వాహనంలో ట్యాంక్‌బండ్‌ను పరిశీలించారు. శ్రీరామగార్డెన్‌లో మున్సిపల్‌ కార్మికులతో మంత్రి కేటీఆర్‌ సహపంక్తి భోజనాలు చేశారు. పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన సెమినార్‌హాల్‌, కంప్యూటర్‌ ల్యాబ్‌, విద్యార్థుల సంఘమాల్‌, తదితర వాటిని ప్రారంభించారు.



ఐటీ హబ్‌ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్‌, పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు



మున్సిపల్‌ నూతన భవనం శిలాఫలకం..



మినీట్యాంక్‌బండ్‌ శిలాఫలకం..



దుబ్బ వైకుంఠధామం..



అర్సపల్లి వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్‌



ఐటీ హబ్‌లో పూజలు చేస్తున్న మంత్రులు కేటీఆర్‌, ప్రశాంత్‌రెడ్డి



ఐటీ హబ్‌లో బాసర ట్రిపుల్‌ ఐటీ విద్యార్థులతో మంత్రి







పారిశుధ్య కార్మికులతో భోజనం చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్‌, షకీల్‌ ఆమేర్‌



న్యాక్‌ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, కేటీఆర్‌



న్యాక్‌ భవనం వద్ద కార్మికులతో మాట్లాడుతూ..



మేయర్‌ చాంబర్‌లో మేయర్‌ నీతూకిరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్‌ మకరందు



అర్సపల్లి వైకుంఠధామం పరిశీలిస్తున్న మంత్రి



మంత్రి కేటీఆర్‌ కాన్వాయ్‌

మంత్రి పర్యటనకు ముందస్తు అరెస్టులు



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్‌ను గృహనిర్బంధం చేసిన పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలో మంత్రి కేటీఆర్‌ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్‌, బీజేపీ, సీపీఎం, ప్రజాపంథా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌ చేశారు. జిల్లాలో 170 మందిని అరెస్ట్‌ చేశారు. మంత్రి సభ ముగియగానే వీరిని వదిలేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్‌ సూర్యనారాయణను గృహనిర్బంధం చేశారు.



యూత్‌ కాంగ్రెస్‌ నగర అధ్యక్షుడు ప్రీతమ్‌ను అరెస్ట్‌ చేసిన పోలీసులు

విద్యార్థి నాయకుల అరెస్ట్‌



విద్యార్థి సంఘాల నేతలు జ్వాల, కిరణ్‌ను అరెస్ట్‌ చేస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేయడానికి వచ్చిన ఏఐపీఎస్‌యూ నేతలు జ్వాల, కిరణ్‌ను పోలీసులు అరెస్ట్‌ చేశారు. విద్యార్థి సంఘాల నేతలు కార్పొరేషన్‌ వద్ద బారికేడ్ల నుంచి లోపలికి వెళ్లడంతో పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి కేటీఆర్‌ను కలిసి హాస్టల్‌ సీట్లు పెంచాలని వినతిపత్రం ఇస్తామని స్పష్టం చేశారు. దీంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జ్వాలా మాట్లాడుతూ డిగ్రీ, ఇంటర్‌ విద్యార్థులకు హాస్టల్‌ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఆలయ ఉద్యోగులకు బయోమెట్రిక్‌

నిజామాబాద్‌ సిటీ: ఉమ్మడి జిల్లాలోని ఆలయాల్లో భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగులకు బయోమెట్రిక్‌ హాజరును త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్‌ ఎస్‌ సుప్రియ వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో అర్చకులు, ఉద్యోగులు సమయపాలన పాటించక పోవటంతో భక్తులకు అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. అందుకే ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో మాదిరిగా భక్తులు ఎక్కువగా వచ్చే ఆలయాల్లో బయోమెట్రిక్‌ హాజరు మిషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుళ్లకు వచ్చే ఆదాయాన్ని తిరిగి ఆలయాల పునర్నిర్మాణాలకే కేటాయిస్తున్నట్లు సుప్రియ తెలిపారు. నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాలో ఆదాయం వచ్చే ఆలయాలు 50 వరకు ఉంటాయని, వీటిపై వచ్చే ఆదాయాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్మించే గుళ్లకు కేటాయిస్తామన్నారు. ఆలయ భూముల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు సహాయ కమిషనర్‌ తెలిపారు. సదాశివనగర్‌లో విశ్వేశ్వరస్వామి ఆలయానికి చెందిన దాదాపు 300 ఎకరాల భూమి కబ్జాలో ఉందని చెప్పారు. కబ్జాకు పాల్పడిన వారిపై కేసు పెడుతున్నామన్నారు. నిజామాబాద్‌ నీలకంఠేశ్వర ఆలయ స్థలాల్లో ఎనిమిది కట్టడాలు, జెండా బాలాజీ మందిరం స్థలాల్లో ఆరు నిర్మాణాలు ఉన్నాయని, వీటిపై కేసు నడుస్తోందని వివరించారు.

కాకతీయ కాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు పెరగడంతో కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్‌ అధికారులు పెంచారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 9028 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 135 క్యూసెక్కులు, అలీసాగర్‌ ద్వారా 180 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090(84.81 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

లారీ ఢీకొని ఒకరి మృతి

వేల్పూర్‌: మండలంలోని అమీనాపూర్‌ రైల్వే వంతెన సమీపంలో బుధవారం లారీ ఢీకొని నిర్మల్‌ జిల్లా కేంద్రానికి చెందిన తోకల విజయ్‌కుమార్‌(37) మృతి చెందాడని ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపారు. వేల్పూర్‌లో సోదరి వద్ద ఉన్న తన కుమారుడిని చూడడానికి టీవీఎస్‌ మోపెడ్‌పై వస్తుండగా వెనకు నుంచి లారీ ఢీకొంది. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని అక్క మగ్గిడి గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

బాల్కొండ: బాల్కొండలోని తెలంగాణ ఫంక్షన్‌ హాల్‌ వెనుక గల మామిడితోటలో ఆర్మూర్‌ మండలం పెర్కిట్‌కు చెందిన ఆకుల రాజు(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. పెర్కిట్‌ బస్టాండ్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహించే రాజు మామిడి తోటలోని గుడిసెలో శవమై కనిపించాడు. తోటలోకి ఉదయం వెళ్లిన యజమాని గమనించి వెంటనే స్థానికులకు తెలుపడంతో వారు పోలీసులకు సమచారం అందించారు. బాల్కొండ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి కనుబొమ్మలపై గాయాలు ఉన్నాయి. దీంతో భార్య లావణ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట: నవీపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మల్కాపూర్‌ శివారులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. నిజాంసాగర్‌ కాలువలో 40 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం ఉందన్నారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు ప్యాంట్‌, డబ్బల చొక్కా ఉన్నట్లు ఆయన తెలిపారు. మృతుడిని ఎవరైన గుర్తిస్తే నవీపేట పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కర్రోల్ల రూప తన పిల్లలతో సహా అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. గ్రామానికి చెందిన కర్రోల్ల బాబుకు భార్య రూపతోపాటు కొడుకు అశ్విన్‌(10), కూతురు అక్షయ(8) ఉన్నారు. ఈ నెల 7న ఇంట్లో ఉన్న రూ.27 వేలు తీసుకొని పిల్లలకు బుక్స్‌ తెస్తానని చెప్పి రూప గోపాల్‌పేటకు వెళ్లింది. రాత్రయినా వారు తిరిగి రాకపోవడంతో బాబు పలుచోట్ల గాలించాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దూపల్లిలో వివాహిత..

రెంజల్‌: మండలంలోని దూపల్లికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి లస్మయ్య ఫిర్యాదు చేశాడని ఎస్సై ఉదయ్‌కుమార్‌ తెలిపారు. యువతికి ఏడాది క్రితం సదాశివనగర్‌కు చెందిన రవితో వివాహం అయింది.

ఇటీవల తమ తల్లిగారింటికి వచ్చిన యువతి సదాశివనగర్‌కు బయలు దేరింది. ఆమె ఇంటికి రాలేదని అల్లుడు ఫోన్‌ చేయడంతో లస్మయ్య పలుచోట్ల గాలించాడు. అయినా ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెచ్చిపోయిన దొంగలు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): డొంకేశ్వర్‌ మండలంలో దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం అర్ధరాత్రి అన్నారం, తొండాకూర్‌ గ్రామాల్లో చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలకు చిక్కకుండా పక్కా ప్లాన్‌తో దొంగతనాలు చేశారు. అన్నారంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన కమ్మరి లింబాద్రికి చెందిన టీవీఎస్‌ స్పోర్ట్స్‌ బైక్‌ను ఎత్తుకెళ్లారు. అదే విధంగా మద్యం దుకాణం షట్టర్‌ను ధ్వంసం చేసి సుమారు రూ.50వేలు విలువ చేసే మద్యం సీసాలను, రూ.4వేల వరకు నగదును అపహరించారు. బీమన్న గుడిలో గంటలను ఎత్తుకెళ్లారు. గ్రామంలో ఒకరి ఇంటి ముందు కులాయిలను ధ్వంసం చేసిన ఆనవాళ్లు కనిపించాయి. కాగా గ్రామంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా అందులో బుధవారం ఉదయం 5 గంటల నుంచి మాత్రమే రికార్డింగ్‌ అయిన ఫుటేజీలు ఉన్నాయి. దీంతో దొంగలు బయటి నుంచి వచ్చారా, లేదా తెలిసిన వ్యక్తుల పనేనా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా అన్నారంలో దొంగతనం జరిగిన సమయానికే తొండాకూర్‌లో కూడా బద్దెన్న అనే వ్యక్తికి సంబంధించిన ప్యాషన్‌ ప్రో బైక్‌కు చోరీ చేశారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన సర్పంచ్‌

రుద్రూర్‌: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తిని వదిలేయాలని కోటగిరి మండలం సుద్దులం సర్పంచ్‌ పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. వివరాలు.. ఆదివారం రాత్రి రుద్రూర్‌ ఎస్సై నీరేష్‌ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. కోటగిరికి చెందిన రవికిరణ్‌ మద్యం తాగి బైక్‌ నడపగా పోలీసులు ఆపి టెస్ట్‌ చేసి కేసు రాస్తున్నారు. ఇదే సమయంలో వచ్చిన సుద్దులం సర్పంచ్‌ సాయిలు డ్రంకన్‌ డ్రైవ్‌లో దొరికిన వ్యక్తిని వదిలేయాలని పోలీసులతో వాగ్వాదం చేశాడు. ఫుల్‌గా తాగి ఉన్నాడని కేసు రాసి వదిలేస్తామని పోలీసులు చెబుతున్నా వినకుండా ఎస్సైని నెట్టివేస్తూ దురుసుగా ప్రవర్తించాడు. 'నేను అధికార పార్టీ సర్పంచ్‌ను.. నా మాట వినరా' అంటూ రోడ్డుపై హంగామా చేశాడు. సోమవారం ఉదయం సదరు సర్పంచ్‌ ఠాణాకు వచ్చి పోలీసులకు క్షమాపణ చెప్పినట్లు తెలిసింది.

కుక్కల దాడిలో గేదె, దూడ మృతి

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): డొంకేశ్వర్‌ మండలం దత్తాపూర్‌లో కుక్కల దాడిలో బుధవారం గేదె, దూడ మృతి చెందాయి. సర్పంచ్‌ గంగమణి నాగరాజు తెలిపిన వివరాలు.. గుంజల సాయిలుకు చెందిన గేదెను ఇంటిముందు కట్టేశాడు. బుధవారం తెల్లవారుజామున గేదె ఈనింది. అదే సమయంలో కుక్కలు దాడి చేశాయి. ఈ దాడితో అప్పుడే పుట్టిన దూడతో పాటు గేదె కూడా మరణించింది.